## హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని హోటల్ మేనేజ్మెంట్ కోర్సుల (బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ) పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్ పరీక్షలను ఈ నెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

## వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీపీఈడీ, డీపీఈడీ మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలతో పాటు బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

## బీఈ కోర్సుల వన్ టైం చాన్స్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని విభాగాల బీఈ కోర్సులు పూర్తి చేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలిపోయిన వారికి వన్ టైమ్ చాన్స్ కల్పించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఓయూ అకాడమిక్ సెనేట్ స్టాండింగ్ కమిటీ అనుమతించిందని చెప్పారు. 2000 సంవత్సరం తరువాత ఆయా కోర్సుల్లో చేరినవారు సైతం తమ బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశమిచ్చామన్నారు. ఈ కోర్సుల అన్ని సెమిస్టర్ల పరీక్ష ఫీజును ఈ నెల 24వ తేదీలోగా, రూ.200 అపరాధ రుసుముతో కలిపి 27వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. అన్ని కోర్సుల పరీక్షలకు సాధారణ పరీక్ష ఫీజుతో పాటు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సిలబస్, పరీక్ష విధానంలోనే వారు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.omania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

# అభద్రతా భావంతోనే ఆరోపణలు

- బీఆర్ఎస్ నేత హరీశ్‌రావుపై అసత్య ప్రచారం చేస్తే సహించేది లేదు
- సొంత పార్టీని చక్కదిద్దుకోవాలని కాంగ్రెస్ నేతలకు ఎమ్మెన్ హితవు
- విలేకరుల సమావేశంలో గ్రేటర్ బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాసరావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ నేత ఎమ్మెన్ శ్రీనివాసరావు

ముషీరాబాద్, మే 15: కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో పీసీసీని, మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసుకోలేని స్థితిలో ఉందని, అటువంటి కాంగ్రెస్ బీఆర్ఎస్‌ను విమర్శించడం తగదని గ్రేటర్ బీఆర్ఎస్ నేత ఎమ్మెన్ శ్రీనివాసరావు అన్నారు. గడిచిన ఏడాదిన్నర కాలంగా పూర్తిస్థాయిలో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసుకోలేక అభద్రతా భావంలో కొట్టుమిట్టాడుతుందని విమర్శించారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొంత పార్టీని చక్కదిద్దుకోవాల్సిన కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ నేత హరీష్ రావు బయటకు వెళ్తారని, తమ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తామని దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రజల్ని మభ్యపెట్టి తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సొంత ఇంటిని చక్కదిద్దుకోలేని కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్‌పై లేనిపోని ప్రచారం మానుకోవాలని హితవు పలికారు. లేని అపోహలు సృష్టించి పార్టీ కార్యకర్తలు, అభిమానులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం అన్ని రంగా ల్లో విఫలమైందని, ముఖ్యమంత్రి స్వయంగా తనను కోసినా పైసా రాదని చెప్తుండడం ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా అసత్యాలను ప్రచారం చేయకుండా బాధ్యతతో వ్యవహరించాలని కాంగ్రెస్ నాయకులకు ఎమ్మెన్ హితవుపలికారు.

## పార్టీ కోసం పనిచేసే వారికి తగిన గుర్తింపు


గడ్డమీది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, మే 15: బీఆర్ఎస్ పార్టీ కోసం పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బీఆర్ఎస్ గాంధీనగర్ డివిజన్ బీసీ విభాగం అధ్యక్షుడు గడ్డమీద శ్రీనివాస్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ దంపతులనును గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృతస్థాయి ప్రచారం చేయాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందని అన్నారు. 10 ఏండ్ల కాలంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలను చేర్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం కోసం పని చేసే వారికి రాబోయే రోజుల్లో మంచి గుర్తింపు ఇస్తామని చెప్పారు.

## ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్

### ఏడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

చిక్కడపల్లి, మే 15: ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న నిందితుడిని చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 7 ద్విచక్ర వాహనాలు రికవరీ చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం సాయంత్రం చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశంలో ఏసీపీ రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రాజునాయక్, డీఐ శంకర్, ఎస్సై అభిలాష్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. ముషీరాబాద్, పార్సిగుట్ట హనుమాన్ ఆలయం దగ్గర కూలీపని చేసుకునే మంతెన కృష్ణంరాజు (రాజు) (44) ద్విచక్ర వాహనాలు చోరీలకు పాల్పడుతున్నాడు. నిందితుడిపై గతంలో హైదరాబాద్ నగర పరిధిలో 12 కేసులు నమోదైనట్లు ఆయన వెల్లడించారు. గత జనవరి 4న తన ద్విచక్ర వాహనం దొంగలించారని బాధితుడు సురేష్ చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుని కోసం గాలింపు మొదలుపెట్టారు. డీఐ ఎం.శంకర్, ఎస్సై పి.అభిలాష్, క్రైమ్ బృందంతో కలిసి విచారణ కొనసాగించారు. ఓ వైపు సీసీటీవీ ఫుటేజ్‌ల సహాయంతో, మరోవైపు విశ్వసనీయ సమాచారం ఆధారంగా నిందితుడు కృష్ణంరాజును అరెస్టు చేశారు. అతని నుంచి ప్యాషన్‌ప్రో బైక్, హోండా డ్రీమ్ యుగ, స్ప్లెండర్, పల్సర్ బైక్, మూడు యాక్టివా బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.


వివరాలను వెల్లడిస్తున్న చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ


ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన పత్రం అందజేస్తున్న మహేశ్వర్‌రెడ్డి

బొల్లారం, మే 15: సీఎం సహాయ నిధి పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం న్యూబోయిన్‌పల్లిలోని తన కార్యాలయంలో ఒకటో వార్డు పరిధి నేతాజీనగర్‌కు చెందిన నామల్ల నరేష్‌గౌడ్‌కు మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి చొరవతో మంజూరైన రూ.52,500 విలువ గల చెక్కును బాధితులకు అందజేసినట్లు పేర్కొన్నారు.

## ఉచిత హోమియోపతి వైద్య శిబిరం ప్రారంభం


ఉచిత హోమియోపతి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ కంది శైలజ

ఉస్మానియా యూనివర్సిటీ: బౌద్ధనగర్ డివిజన్ వార్డు కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఉచిత హోమియోపతి వైద్య శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ కంది శైలజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీజినల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి సహకారంతో ప్రతి గురువారం ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## మెరుగైన పద్ధతులతో అధిక దిగుబడులు


కార్యక్రమంలో పాల్గొన్న రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల డీన్ డా. గోవర్ధన్

దుండిగల్, మే 15: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, నాగులూర్‌లో గురువారం రైతులకు రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మెరుగైన యాజమాన్య పద్ధతులు, పంట అధిక దిగుబడులపై రైతులకు అవగాహన కల్పించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి వ్యవసాయ కళాశాల డీన్ డా.ఎం.గోవర్ధన్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పాడిపంట, సమగ్ర వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఐబీటీ డైరెక్టర్, సీనియర్ ప్రొ.డా.సి.వి.సమీర్ మాట్లాడుతూ నూతన వంగడాల వినియోగం, చీడపీడల నుంచి తట్టుకునే విధానాలను వివరించారు. శాస్త్రవేత్త డా. కె.శైలజ మాట్లాడుతూ భూసార పరీక్ష ఉద్దేశ్యం మట్టి నమూనాల పరీక్షలు, ఆవశ్యకతను వివరించారు. సేంద్రియ ఎరువుల వాడకం, జీవని ఎరువుల ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్సీ యాదగిరి, రైతులు పాల్గొన్నారు.

## పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు


దోమలగూడలో పర్యటిస్తున్న డిప్యూటీ కమిషనర్ రామానుజులరెడ్డి

ముషీరాబాద్, మే 15: పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వర్తించాలని జీహెచ్ఎంసీ సర్కిల్-15 డిప్యూటీ కమిషనర్ రామానుజులరెడ్డి సూచించారు. సర్కిల్ పరిధిలో చేపడుతున్న రోడ్డు నిర్మాణాలలో నాణ్యత పాటించాలని, అక్రమ భవన నిర్మాణాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని అధికారులకు ఆదేశించారు. గురువారం ఆయన దోమలగూడలో పర్యటించారు. సిబ్బంది పనులు చేపడుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. బస్తీలు, కాలనీలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చెత్త తొలగింపు చేపట్టాలని అధికారులకు సూచించారు.


అక్షిత ఫౌండేషన్-నటరాజ్ అకాడమీ ఆధ్వర్యంలో వార్షికోత్సవం సందర్భంగా గురువారం రవీంద్రభారతిలో ఐకాన్ అవార్డులు కార్యక్రమం నిర్వహించారు. వక్తలుగా బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్, ఆలేటి శ్రీనివాస్‌గౌడ్, తుంగతుర్తి రవి, ఆర్.వరప్రసాద్, ఆమని ములుగు, మద్దెల సందీప్‌కుమార్, నటరాజ్ వ్యవస్థాపకుడు నల్లా గిరి విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి పలువురి నృత్య కళాకారులకు ఐకాన్ అవార్డులను బహూకరించారు. **– రవీంద్రభారతి,15**

## బీఈ చివరి సెమిస్టర్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈ చివరి సెమిస్టర్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈ (ఏఐసీటీఈ) ఎనిమిదో సెమిస్టర్ మెయిన్, బ్యాక్ లాగ్, బీఈ (సీబీసీఎస్), బీఈ (నాన్ సీబీసీఎస్) చివరి సెమిస్టర్ బ్యాక్లాగ్ పరీక్ష ఫీజును ఈ నెల 24వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ. 200 అపరాధ రుసుముతో 27వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

## ప్రైవేట్ బస్సు దగ్ధం

మేడ్చల్, మే 15: ప్రైవేటు బస్సులో మంటలు చెలరేగి దగ్ధమైన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. సిద్దిపేట జిల్లా బండమైలారం నుంచి కొంపల్లికి వెళ్తున్న బస్సు మేడ్చల్ ఐటీఐ వద్దకు రాగానే ఒక్కసారిగా బస్సులో మంటలు చెలరేగాయి. దీంతో డ్రైవర్ అప్రమత్తమై పక్కకు నిలిపివేశాడు. చూస్తుండగానే క్షణాల్లో బస్సు పూర్తిగా దగ్ధమైంది. బస్సులో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైనట్టు డ్రైవర్ తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక శకట సిబ్బంది మంటలను ఆర్పివేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద ఘటనను పరిశీలించి, వివరాలు సేకరించారు.

## హైదరాబాద్ డిపోలో త్రైమాసిక రీజినల్ అవార్డుల ప్రదానం


హైదరాబాద్ డిపోలో త్రైమాసిక ప్రగతి చక్రం త్రైమాసిక రీజినల్ అవార్డులు అందుకున్న డ్రైవర్స్, కండక్టర్స్

జియాగూడ, మే 15 : హైదరాబాద్ డిపోలో త్రైమాసిక ప్రగతి చక్రం త్రైమాసిక రీజినల్ అవార్డుల ప్రదానం కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన రంగారెడ్డి రీజియన్ డ్రైవర్స్, కండక్టర్స్, మెయింటెనెన్స్ సిబ్బందికి రీజినల్ మేనేజర్ ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలు అందజేశారు. ముఖ్యఅతిథిగా రంగారెడ్డి రిజినల్ మేనేజర్ శ్రీలత, డిప్యూటీ రీజినల్ మేనేజర్ సరస్వతి, పర్సనల్ అధికారి శ్రీనివాస్, కస్టమర్ రిలేషన్ మేనేజర్ శ్రీనివాస్, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


డబుల్ బెడ్రూం కాలనీలో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ హేమలత

బన్సీలాల్‌పేట్, మే 15: ఎమ్మెల్యే తలసాని ఆదేశాలతో చాచానెహ్రూ నగర్‌లోని డబుల్ బెడ్రూం మార్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులు గురువారం ప్రారంభించారని డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు తెలిపారు. జీహెచ్ఎంసీ డిప్యూటీ ఈఈ ఆంజనేయులు పర్యవేక్షణలో చేపట్టిన శిథిలావస్థకు చేరిన పాత రోడ్డు తొలగింపు పనులను జేసీబీ సహాయంతో మొదలుపెట్టారని అన్నారు. ఎమ్మెల్యే నిధులు మంజూరై శిలాఫలకం ఏర్పాటు చేశారు. అయినా పనులు మొదలు కాకపోవడంతో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కట్టెలమండిలో కాల్వ నిర్మాణం, మేకలమండి ఎదురుగా గాంధీనగర్ వెళ్లే దారిలో నాలాపై స్లాబు నిర్మాణం, పద్మారావు నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ఆగిపోయాయని ఆయన ఆరోపించారు. నిధులు లేవని, కాంట్రాక్టర్లు రావడం లేదని పలు రకాల కారణాలతో ప్రభుత్వ అధికారులు ఎన్ని చెప్పినా ప్రజల్లో అసంతృప్తి పెరుగుతున్నదని ఆయన అన్నారు. ఎట్టకేలకు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ చొరవతో చాచానెహ్రూనగర్‌లో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారని, ఎమ్మెల్యే తలసానికి బస్తీవాసులు ధన్యవాదాలు చెప్పారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రేమ్‌కుమార్, వినయ్‌కుమార్, స్థానికులు పాల్గొన్నారు.

**డబుల్ బెడ్రూం కాలనీలో..**

బన్సీలాల్‌పేట్ డివిజన్ డబుల్ బెడ్రూం కాలనీలో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులను కార్పొరేటర్ కె.హేమలత ప్రారంభించారు. గత ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే తలసాని రోడ్ల నిర్మాణానికి నిధులను మంజూరు చేసి శిలాఫలకం ఏర్పాటు చేసి ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. వివిధ కారణాలతో ఎట్టకేలకు రోడ్ల నిర్మాణానికి మోక్షం లభించడం పట్ల ఆమె ఆనందం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా చూడాలని ఆమె అధికారులను కోరారు. జీహెచ్ఎంసీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీపతి, విజయ్‌పాల్, దినేష్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

## 17న అల్వాల్ ఐటీఐలో జాబ్ మేళా


**మేడ్చల్ కలెక్టరేట్, మే 15:** అల్వాల్ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 17న జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ పూర్తి చేసిన వ్యక్తులకు అప్రెంటిస్ షిప్ ఉంటుందని, ఎంప్లాయిమెంట్ www.employment.telangana. gov.inలో పేర్లు నమోదు చేసుకొని కార్డు పొందాలని సూచించారు. వివరాలకు ఫోన్ నంబర్లు 90595 29377, 90003 85863, 73868 09422, 98664 65024, మెయిల్ ఐడీ rajsekhar<bha>@</bha>yskinfotech.com సంప్రదించాలని అన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**మేడ్చల్, మే 15 :** గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...డబిల్‌పూర్ గ్రామ పరిధిలో ఉన్న శ్రీరామ్‌స్పిన్నింగ్ మిల్‌కు సమీపంలో ఉన్న చెట్ల పొదల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు గుర్తించిన స్థానికులు బుధవారం పోలీసులకు సమాచారం అం దించారు. పోలీసులు కేసు నమోదు చేశా రు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలి

- భవానీనగర్ కాలనీవాసులతో జీహెచ్ఎంసీ కమిషనర్ ముఖాముఖి
- స్టార్మ్‌వాటర్ డ్రెయిన్, శానిటేషన్ సమస్యలు తీర్చాలని కాలనీవాసుల విజ్ఞప్తి


ఏఎస్‌రావునగర్ డివిజన్ భవానీనగర్‌కాలనీ వాసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, పాల్గొన్న అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, డీసీ జగన్

కాప్రా, మే 15: కాలనీలో పారిశుధ్యం సక్రమ నిర్వహణకు కాలనీ ప్రజలు పారిశుధ్య విభాగానికి సహకరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ప్రజలను కోరారు. బుధవారం జవహర్‌నగర్ పర్యటనకు వెళ్లి తిరిగి వస్తున్న సందర్భంగా ఇదే దారిలోని ఏఎస్‌రావునగర్ డివిజన్ భవానీనగర్ కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో ఏర్పా టు చేసిన ముఖాముఖి సమావేశంలో ఎగువనుంచి వచ్చే వర్షపునీరు కాలనీలో నిలువడం వల్ల సమస్యలు ఎదుర్కొంటున్నామని, ఇందుకోసం స్టార్మ్ వాటర్ డ్రెయిన్‌లను నిర్మించాలని, పారిశుధ్య విభాగంలో ఖాళీలను భర్తీ చేయాలని కాలనీ ప్రతినిధులు కమిషనర్‌కు విజ్ఞప్తి చేయగా దీనిపై సర్కిల్ డీసీ జగన్, ఈఈ నాగేందర్ తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్ మాట్లాడుతూ పారిశుధ్య విభాగంలో ఖాళీగా ఉన్న స్థానాలను రక్తసంబంధీకులనుంచి భర్తీ చేసేందుకు ప్రభుత్వం నుంచి ఇటీవలే ఆదేశాలు జారీ అయ్యాయని, త్వరలో ఖాళీగా ఉన్న స్థానాల్లో సిబ్బందిని భర్తీ చేయనున్నట్టు తెలిపారు. కాలనీలో ఎలాంటి సమస్యలు లేకుండా, భవానీనగర్ కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కాలనీ మాజీ అధ్యక్షులు అంజిరెడ్డి జీహెచ్ఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కాలనీ సమస్యలపై కాలనీ అధ్యక్ష కార్యదర్శులు వి.శేఖర్, శ్రీరాములు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్, డీసీ జగన్, ఈఈ నాగేందర్, ఏఎంఓహెచ్ డాక్టర్ మధుసూధన్‌రావు, శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, జవా న్లు, ఎస్ఎఫ్ఏలు స్థానికులు పాల్గొన్నారు.